రెసిడెన్షియల్ స్కూళ్లలో రక్షణపై నమ్మకాన్ని కల్పించాలి



- మరమ్మతులు, చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- ప్రతి పాఠశాలలో స్టాఫ్ నర్సు అందుబాటులో ఉండాలి
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు ఇంటి దగ్గరి కంటే రెసిడెన్షియల్ పాఠశాలలోనే రక్షణ ఎక్కువగా ఉంటుందనే నమ్మకం తల్లిదండ్రులకు ఉండేలా విద్యార్థులను చూసుకోవాలని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లదేనని స్పష్టం చేశారు. లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, శానిటేషన్, వాడుకునేందుకు వీలుగా టాయిలెట్లు, వాడుకునే నీరు, పైప్‌లైన్ల మరమ్మతుల వంటి చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రైవేటు భవనాలలో ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్న స్కూళ్లలో కనీస అవసరాలను తీర్చేలా భవన యజమానులు మరమ్మతులను చేయించని పక్షంలో వారికి ఇచ్చే అద్దెలో మినహాయించి మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ప్రిన్సిపాళ్లకు సూచించారు. పిల్లలకు అందించే ఆహారం మెనూ ప్రకారం పరిశుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. సిద్ధంగా ఉన్న ఆహారాన్ని ముందుగా మెస్ కమిటీ వాళ్లు తిన్న తరువాత పిల్లలకు పెట్టాలని, ప్రతి స్కూల్‌లో మెస్ కమిటీలను నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు జ్వరం ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే రెండురోజుల వరకు విడిగా ఉంచి వైద్యం చేయించాలన్నారు. తగ్గని పక్షంలో దగ్గరగా ఉన్న పల్లె దవాఖానా, పీహెచ్‌సీ సెంటర్లలో చూపించాలని తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్టాఫ్ నర్స్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. పల్లె దవాఖానా, పీహెచ్‌సీ సెంటర్లలోని డాక్టర్ల ఫోన్ నంబర్లు, అంబులెన్సు ఫోన్ నంబర్లు నర్సు దగ్గర ఉండేలా చూడాలన్నారు. అవసరమైన మందులను డీఎంహెచ్‌ఓ నుంచి తీసుకోవాలని సూచించారు. బాలికల రెసిడెన్షియల్ స్కూళ్ల దగ్గర పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే గస్తీ కోసం అదనపు పోలీసులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టరు తెలిపారు. రెసిడెన్షియల్ ప్రిన్సిపాళ్ల పలు సమస్యలను కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశురామ్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్ కుమార్, మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కె.వీణ, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



మీతో సాక్షి

- వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకుంటాం
- తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్
- 'సాక్షి' ఫోన్ ఇన్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యల పరిష్కారం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తూంకుంట మున్సిపాలిటీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ అన్నారు. ఖాళీ స్థలాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన 'సాక్షి' ఫోన్ ఇన్ ద్వారా ప్రజలను కోరారు. సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రజల సమస్యలను నేరుగా విని అప్పటికప్పుడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పట్ల తమ వంతు సామాజిక బాధ్యతగా 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం మంచి కార్యక్రమమని కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో 16 వార్డులకు సంబంధించి వార్డు ఆఫీసర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు. –శామీర్‌పేట్



'సాక్షి' ఫోన్ ఇన్‌లో పాల్గొన్న తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వివిధ శాఖల అధికారులు

ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలు, పరిష్కారాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

6వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. దీంతో ఇంట్లోని రెండేళ్ల చిన్నారికి డెంగీ వ్యాధి సోకింది. నిత్యం ఫాగింగ్ చేయించాలి.

– హేమంత్ సాగర్, 6వ వార్డు తూంకుంట

కమిషనర్: ప్రతి వార్డుల్లో తప్పనిసరిగా ఫాగింగ్ చేయిస్తాం. నేటి నుంచి ప్రతి వార్డులో రిజిస్టర్ మెయింటేన్ చేస్తూ స్థానికుల సంతకాలు తీసుకుంటాం.

గుంతల రోడ్ల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మాకు నూతన వేయించే అవకాశం ఉందా.

– తీగుళ్ల మురళీగౌడ్, తూంకుంట

కమిషనర్: రోడ్డు మరమతులకు నివేదిక తయారు చేసి పరిపాలన ఆమోదం కోసం పై అధికారులకు పంపించాం. త్వరలోనే మరమతులు చేపడతాం.

దేవరయాంజాల్‌లోని మహాలక్ష్మీ వెంచర్ వద్ద నీటి ప్రవాహం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి. వీధి దీపాలు వెలగడం లేదు. రోడ్లపై చెత్త వేస్తున్నారు.

– భీమిడి జైపాల్‌రెడ్డి, దేవరయాంజాల్

కమిషనర్: వరద నీరు వెళ్లడానికి ఇటీవలే కాలువను వెడల్పు చేసి, నీరు నిలవకుండా చేశాం. శాశ్వత పరిష్కారానికి బాక్స్ డ్రైన్ కట్టడానికి సమాలోచనాలు చేస్తున్నాం.

దేవరయాంజాల్ నుంచి డీఎంసీ వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అటు వైపు వెళ్లాలంటే వాహనదారులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– మనోహర్, మల్లన్నకాలనీ

కమిషనర్: డీఎంసీ వెళ్లే దారి మా దృష్టిలో ఉంది. మరమ్మతులకు ఆర్ అండ్ బీ స్థానిక డీఈ లెటర్ పెట్టాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

ఖాళీ స్థలాలు, కాలనీల్లోని అంతర్గత రోడ్లలో గుంతలు ఏర్పడి నీరు నిలిచాయి. దీంతో ఆ గుంతలు దోమలకు ఆవాసంగా మారాయి.

– గురుప్రసాద్, ఫేజ్–2, హకీంపేట

కమిషనర్: నీటి గుంతలను కంకర, డస్ట్‌తో మూసేస్తాం. ఖాళీ స్థలాల్లో నిల్చిన నీటిని జేసీబీ సాయంతో తొలగిస్తాం.

దేవరయాంజాల్‌లోని రామాలయం సమీపంలో కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నాం.

– రాము, దేవరయాంజాల్

కమిషనర్: బ్లూ క్రాస్ వాళ్లతో టై ఆప్ అయ్యాము. వారి సహకారంతో ఇటీవలే సుమారు 80 కుక్కలను పట్టించాం. మరోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

హకీంపేట బస్టాండ్ నుంచి సీఐఎస్ఎఫ్ వరకు ఉన్న మ్యాన్ హోల్స్ పై కవర్ లేవు. దీంతో వర్షం పడిన ప్రతి సారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యపై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చా. ఇకనైనా సమస్యను పరిష్కరించండి.

– బన్ని, హకీంపేట

కమిషనర్: అధికారులను వెంటనే అక్కడికి చేరుకొని నివేదిక అందజేయమని ఆదేశించా. త్వరలోనే మ్యాన్ హోల్ కవర్స్ ఏర్పాటు చేయిస్తా.

దేవరయాంజాల్ ఆగాఖాన్ రోడ్డులో ప్రతి ఆదివారం కురగాయల మార్కెట్ పెడుతున్నారు. మార్కెట్ పూర్తి అయిన తరువాత వ్యాపారులు కూరగాయల వ్యర్థాలను రోడ్డుపైనే పడేస్తున్నారు. డస్ట్ బిన్‌లను అందుబాటులో ఉంచండి. అలాగే రోడ్డుపై చెత్త వేస్తే ఫైన్ బోర్డులను ఏర్పాటు చేయండి.

– కొండల్‌రెడ్డి, దేవరయాంజాల్

కమిషనర్: డస్ట్ బిన్‌లతో పాటు ఫైన్ బోర్డులను ఏర్పాటు చేయిస్తాం. కూరగాయల వ్యాపారులు రోడ్డుపై వ్యర్థాలు వేసే వారికి నోటీసులు జారీ చేస్తాం.

వినాయక చవితి సందర్భంగా దేవరయాంజాల్ చెరువు వద్ద నిమజ్జనానికి క్రేన్‌తో పాటు లైటింగ్ ఏర్పాటు చేయండి.

– జగదీష్

కమిషనర్: త్వరలోనే వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తాం. అందరూ ఒకే రోజు నిమజ్జనం చేస్తే బాగుంటుంది. అన్ని వసతులు ఏర్పాటు చేస్తాం.

ఎనిదేళ్లుగా ఎన్నో సార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాం. కాలనీవాసులంతా రూ. 4 లక్షలు వెచ్చించి తాత్కాలిక డ్రైనేజీ పైప్ వేయించుకున్నాం. శాశ్వత పరిస్కారం చూపండి.

– మోహిత్, ఓల్డ్ ఐస్ ఫ్యాక్టరీ కాలనీ

కమిషనర్: కాలనీకి రోడ్డు శాంక్షన్ అయ్యింది. దీంతో పాటు డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తాం.

మా వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలు మార్లు అధికారులు దృష్టికి తీసుకొచ్చాం. పట్టించుకోవడం లేదు.

– వెంకటేష్, 9వ వార్డు

కమిషనర్: వర్షం కురుస్తున్నందున విద్యుత్ మరమతు పనులకు ఇబ్బంది. మంగళవారం సాయంత్రం వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తా.

దేవరయాంజాల్ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో రాఖీమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుక్కలను పెంచుతున్నారు. తమ ఇళ్లపైకి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం.

కమిషనర్: ఆ ఫౌండేషన్‌ను అక్కడి నుంచి ఖాళీ చేయాలని నోటీసులు అందించాం. 15 రోజుల్లో ఖాళీ చేస్తారు.

పోతాయిపల్లిలో రోడ్డు వెంటనే పనులను చేపట్టండి.

– రాజు, పోతాయిపల్లి

కమిషనర్: రోడ్డు పనులకు నివేదికలు తయారు చేశాం. టెక్నికల్ అనుమతుల కోసం వేచి చూస్తున్నాం. మరో 20 రోజుల్లో పనులను ప్రారంభిస్తాం.



'సాక్షి' ఫోన్ ఇన్‌లో వచ్చిన ఫిర్యాదుకు స్పందించి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిన వరద



నాగారంలోని రాంపల్లి చౌరస్తా వద్ద వరదను పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్



వరదనీరు వెళ్లేందుకు కృషి చేస్తున్న నాగారం మున్సిపల్ సిబ్బంది

నాగారంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల తోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు కాలనీల్లో వరద నీరు, మురుగునీరు ముంచెత్తింది. భారీవర్షం కారణంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు, మురుగు నీరంతా నాగారం మున్సిపల్ పరిధిలోని లోతట్టుకాలనీలకు చేరింది. బీఎంఆర్, సాయిరత్నా, అరవింద్‌నగర్, సాయిసంజీవ, తివారీ ఎన్‌క్లేవ్, బీబీసీ రహదారుల గుండా వరద, మురుగునీరు ప్రవహిస్తుండటంతో లోతట్టు కాలనీవాసులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వర్షాలు పడితే చాలు లోతట్టు కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

- రాంపల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై నుంచి పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహించడంతో ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జామ్ అవుతుంది. మున్సిపల్ సిబ్బంది, కీసర పోలీసులు అతి కష్టం మీదుగా వాహనాల రాకపోకలు సాగేలా వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు.
- మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్‌లు రాంపల్లిచౌరస్తాలో వరద ప్రవహించే ప్రాంతంతోపాటు లోతట్టు కాలనీల్లో పర్యటించారు. మున్సిపల్ సిబ్బంది చేత వరద నీరు సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.
- నాగారం జేఏసీ అధ్యక్షుడు జయకుమార్, జనరల్ సెక్రటరీ కమలాకర్, నేతలు సతీస్‌రెడ్డి, శైలజ, వినయ్‌రెడ్డి, తదితరులు లోతట్టుకాలనీలో పర్యటించి కాలనీవాసులకు పాలు, బ్రెడ్, చిన్నారులకు బిస్కెట్లు తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. భవానీనగర్ తదితర లోతట్టుకాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కీసర: ఆపదలో ఉన్నవారికి ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో నివాసం ఉంటున్న మాధవి కృష్ణకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 25,500లకు సంబంధించిన చెక్కును ఆయన లబ్దిదారులకు అందజేశారు.

నియామకం

ఘట్‌కేసర్: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఘట్‌కేసర్ మున్సిపల్ విభాగం కన్వీనర్‌గా పట్టణానికి చెందిన అంకం చంద్రకాంత్, కో కన్వీనర్‌గా శివదీపక్, నియోజకవర్గ కో కన్వీనర్‌గా భానుయాదవ్ సోమవారం నియమితులయ్యారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి శశిధర్, ఉపాధ్యక్షులు వైకుంఠం, కేంద్ర కమిటీ సభ్యుడు బుచ్చిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రామతీర్థ వారికి నియామక పత్రాలను అందజేశారు.

బన్సీలాల్ వ్యాస్‌జీకి నివాళి

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ కళాశాలలో గురుకుల్ వ్యవస్థాపకుడు, స్థల దాత బన్సీలాల్ వ్యాస్‌జీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య హాజరయ్యారు. కౌన్సిలర్ శశికళ, జంగయ్యయాదవ్, దేవేందర్‌ముదిరాజ్, గురుకుల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు

చివరిరోజైన సోమవారం స్వామివారికి తైలాభిషేకం, అన్నపూజ

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా నెల రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు సోమవారంతో ముగిశాయి. ప్రత్యేక పూజల్లో భాగంగా చివరిరోజైన సోమవారం అవామాస్య సందర్భంగా గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారి(శివలింగం)కి వేద పండితులు విశేషపూజలను నిర్వహించారు. తెల్లవారుఝామున మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం స్వామివారికి తైలాభిషేకం తోపాటు, లోకంలో క్షుద్బాధతొలగిపోవాలని కోరుతూ అన్నాభిషేకం (వరి అన్నంతో శివలింగాన్ని కప్పివేయడం) పూజను కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ ట్రస్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సోమవారం అమావాస్య కావడం చేత స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి కీసరగుట్టకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



అన్నాభిషేక పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ నాగలింగం తదితరులు

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు: విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఘట్‌కేసర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మున్సిపాలిటీలోని ఖమ్మరిబస్తీ ధర్మశాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఏఈ సతీశ్‌కుమార్‌తో మాట్లాడి పాడైన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సోమవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. అనంతరం దాని పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్, లక్ష్మారెడ్డి, శేఖర్‌గుప్తా, మల్లికార్జున్‌రాజు, సురేష్, రాములు, ప్రతాప్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆట వస్తువుల వితరణ



వస్తువులు అందజేస్తున్న దాత సురేష్‌కుమార్

మేడ్చల్: గౌడవెల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఆడుకోవడానికి మేడ్చల్‌కు చెందిన దాత ఆట వస్తువులను విరాళంగా అందజేశారు. మేడ్చల్ పట్టణంలో నివసం ఉంటే ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ సురేష్‌కుమార్ రూ. 20 వేల విలువ చేసే ఆట వస్తువులను అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, నాయకులు వినోద్‌గౌడ్, రాజుగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఘట్‌కేసర్: ఫోన్ షాప్‌కు వెళ్లి సిమ్ తీసుకొని వస్తాను ఎక్కడికి వెళ్లకుండా కూర్చోవాలని చెప్పి తిరిగి వచ్చేసరికి ఆ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ శేఖర్ సమాచారం మేరకు... బీహార్ గయాకు చెందిన పరమానంద్ బింద్(50) రెండు నెలల క్రితం ఉపాధి కోసం వచ్చి పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం సాయంత్రం తన సడ్డకుడు శ్రీరామ్‌తో కలిసి ఘట్‌కేసర్ పట్టణానికి వచ్చారు. సిమ్ కొనుగోలు చేయడానికి శ్రీరామ్ ఫోన్ షాప్‌కు వెళుతూ అంబేడ్కర్ చౌరస్తాలో కూర్చోవాలని పరమానంద్ బింద్‌కు సూచించి వెళ్లిపోయాడు. అరగంట తర్వాత వచ్చిచూడగా పరమానంద్ బింద్ కనిపించలేదు. అతడి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వచ్చింది. పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద గాలించినా అతని ఆచూకీ లభించనందున శ్రీరామ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.



పరమానంద్ బింద్

సైనిక్‌పురి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అరుణోదయ కాలనీలో నివసించే ఆంజనేయులు ఇటీవల కుమారుడికి వివాహం చేశాడు. ఆంజనేయులుకు సైనిక్‌పురిలో మరో ఇల్లు ఉండటంతో ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో ఇంట్లో వెళ్లి చూడా బీరువాలోని నాలుగు తులాల బంగారం, రూ. 50 వేల నగదును దొంగిలించినట్లు గుర్తించారు. అయితే అక్కడ ఉన్న సీసీ ఫుటేజీ, హార్డ్‌డిస్క్‌ను దొంగలు పగులగొట్టి వారి వెంటే తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జోహార్ వైఎస్సార్


పలు ప్రాంతాల్లో వైఎస్సార్ వర్ధంతి



మేడ్చల్‌లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



జ్ఞానాపూర్‌లో...





శ్రీరంగవరంలో...



గాడవెల్లిలో...

మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం నిర్వహించారు. వాడవాడలా ఏర్పాటు చేసిన వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు కాంగ్రెస్ పార్టీ నియోజకరవ్గ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం కోసం ప్రారంభించిన సరికొత్త పథకాలు దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాందీ పలికాయని కొనియాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తన ఆఖరి శ్వాస వరకు తన జీవన పయనాన్ని కొనసాగించారంటూ వైఎస్సార్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. – మేడ్చల్ జోన్ బృందం



కీసరలో...



ఘట్‌కేసర్‌లో...



దేవరయాంజాల్‌లో...



జవహర్‌నగర్‌లో...



అంకుషాపూర్‌లో...